
ఆంధ్రజ్యోతి
5

వనపర్తి
జిల్లా వార్తలు
బుధవారం 7 మే 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 41.7 • కనిష్ఠం : 25.7

అత్తింటి వేధింపులు భరించలేక
## వివాహిత ఆత్మహత్య
- సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళ
- పంజుగుల రోడ్డు సమీపంలో కేఎల్ఐ కాల్వలో పడి సూసైడ్

7

## ఐదేళ్లు .. భారంగా
రైతులపైనే హమాలీ చార్జి
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇదీ తంతు
- ప్రభుత్వాలు మారినా తీరు మారలే...
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా కరుణ చూపాలంటున్న రైతులు

6


అలంపూర్ : ఉప్పల కొనుగోలు కేంద్రంలో ధాన్యం

## మెడికల్ వేస్టేజీని బహిరంగంగా పారేయొద్దు
- మాతా శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి ప్రసూనారాణి

7

## నైపుణ్యాలను పెంచుకోవాలి
- పాలమూరు యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి

7

## ఉడిపి హోటల్‌లో తనిఖీలు
- శాంపిల్స్ సేకరించిన అధికారులు


ఉడిపి హోటల్ ఫ్రిజ్‌లోని ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి నీలిమ

వనపర్తి టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కేంద్రంలోని ఉడిపి హోటల్లో ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. హోటల్‌లో ఓ వినియోగదారుడికి సప్లై చేసిన ఇడ్లీలో జెర్రి వచ్చింది. ఈ విషయంపై వివిధ పత్రికల్లో వార్తలు ప్రచురితం అయ్యాయి. అందుకు స్పందించిన ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి నీలిమ మంగళవారం తన బృందంతో పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో గల ఉడిపి హోటల్‌లో తనిఖీ చేశారు. హోటల్‌లోని వంట గది, పాత్రలు, ఆహార పదార్థాలను పరిశీలించారు. ఆహార పదార్థాల శాంపిల్స్‌ను సేకరించి, హైదరాబాద్‌లోని సెంట్రల్ ల్యాబ్‌కు పంపించారు. ఎన్ని సంవత్సరాల నుంచి హోటల్ నిర్వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. శాంపిల్స్ ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని హోటల్ యాజమాన్యాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వాజీద్ పాల్గొన్నారు. అలాగే ఆహారభద్రత జిల్లా ఇన్‌చార్జి అధికారి డాక్టర్ రామచంద్రారావు ఉడిపి హోటల్‌ను సాయంత్రం తనిఖీ చేశారు. పరిశుభ్రత లేకపోవడంతో నోటీసులు జారీ చేశారు. పరిశుభ్రత పాటించకుంటే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు.

పుణె నిపుణుల కమిటీ నివేదిక
# మరింత ఆలస్యం..!
- పూర్తిస్థాయి నివేదిక కోసం రూ.కోటికి పైగా అంచనా
- ర్యాలంపాడు రిజర్వాయర్ మరమ్మతులు మరింత జాప్యం
- ఈ ఏడాది కూడా పూర్తిస్థాయి నీటి నిల్వ లేనట్లే
- ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో ఇరిగేషన్ అధికారులు


ర్యాలంపాడు రిజర్వాయర్

గద్వాల, మే 6 (ఆంధ్రజ్యోతి): నెట్టంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ర్యాలంపాడు రిజర్వాయర్ మరమ్మతు పనుల పరిశీలనకు వచ్చిన పుణె నిపుణుల కమిటీ నివేదిక రావడానికి మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. గత నెల 10వ తేదీన పుణెకు చెందిన వాటర్ రీసోర్స్ పవర్ స్టేషన్ వారు ర్యాలంపాడు రిజర్వాయర్ లీకేజీలు ఎలా అవుతున్నాయి.. అనే దానిపై ఐదుగురితో కూడిన నిపుణుల కమిటీ పరిశీలన చేసింది. ఇప్పుడు ప్రాథమిక నివేదికను ఇరిగేషన్ అధికారులకు పంపింది. పూర్తిస్థాయిలో పరిశీలన చేస్తే తప్ప లీకేజీలకు కారణాలు బహిర్గతం కావని తేల్చి చెప్పింది. ఇందుకోసం నిపుణుల కమిటీ కనీసం 15 రోజుల పాటు అక్కడే ఉండి పరిశీలన పరీక్షలు చేస్తే తప్ప ఒక అంచనాకు వచ్చే అవకాశం లేదని స్పష్టం చేసింది. ఇందు కోసం రూ. కోటికి పైగా ఖర్చు అవుతుందని నివేదికలో పేర్కొంది. ఆ మొత్తాన్ని డిపాజిట్ చేస్తే పరిశీలనకు వస్తామని తేల్చి చెప్పారు.. దీంతో ర్యాలంపాడు రిపేర్లు మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉందని తేలిపోయింది.


గత నెలలో ర్యాలంపాడు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న పుణె నిపుణుల కమిటీ సభ్యులు (ఫైల్)

**నిపుణుల కమిటీపై ఆశలు గల్లంతు**

పుణె నిపుణుల కమిటీ పరిష్కారం చూపుతోందని ఇరిగేషన్ అధికారులు ఆశపడ్డారు. వారి అంచనాలు తలకిందులు అయ్యాయి. గత నెల 10వ తేదీన సెంట్రల్ వాటర్ పవర్ రిసోర్స్ స్టేషన్‌కు చెందిన నిపుణుల బృందం ర్యాలంపాడును పరిశీలించారు. ర్యాలంపాడు కట్ట కింది భాగంలోని మట్టి నమూనాలను సేకరించారు. కట్టకింది భాగంలో కట్ట పరిస్థితి ఏమిటి అనే విషయాలను

- మిగతా 6లో..


ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ అయిన పదర మండలం తెలుగుపల్లి కేజీబీవీ

## 19 కేజీబీవీలు అప్‌గ్రేడ్
- ఈ ఏడాది నుంచి ఇంటర్ విద్య ప్రారంభం
- నాగర్ కర్నూల్ జిల్లాలో 9, వనపర్తిలో 6, గద్వాలలో 4 కేజీబీవీలకు అనుమతి
- నూతనంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, అకౌంటింగ్, ట్యాక్స్ కోర్సులు
- ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం

విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను (కేజీబీవీ) ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్ 9, వనపర్తి 6, జోగుళాంబ గద్వాల జిల్లాలోని 4 కేజీబీవీలను అప్‌గ్రేడ్ చేశారు. అంతే కాకుండా ఈ ఏడాది నుంచి అధునాతన కోర్సులు కూడా ప్రవేశపెట్టారు. దీంతో నిరుపేద విద్యార్థినులకు నాణ్యమైన బోధన అందనున్నది.

6

- నాగర్‌కర్నూల్ టౌన్, ఆంధ్రజ్యోతి


కుటుంబ సభ్యులతో కలిసి జోగుళాంబ అమ్మవారిని దర్శించుకున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్

జోగుళాంబ ఆలయంలో
## స్పీకర్ ప్రత్యేక పూజలు

అలంపూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూరులోని ఐదవ శక్తి పీఠం జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వారికి హరిత టూరిజం హోటల్ వద్ద ఎమ్మెల్యే విజయుడు, కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాస రావు ఘనస్వాగతం పలికి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఆలయానికి చేరుకున్న స్పీకర్‌కు ఆలయ చైర్మన్ కొంకల నాగేశ్వర్ రెడ్డి, ఈవో పురేందర్ కుమార్ పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామివారికి ఆలయంలో గణపతి పూజ, అభిషే కం, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన వంటి విశేష పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అంద జేశారు. వారి వెంట పాలక మండలి సభ్యులు వెంకటేశ్వర్లు, నాగశిరోమణి, జగదీశ్వర్ గౌడ్, సీఐ రవి బాబు, ఎస్సైలు వెంకటస్వామి, మహేష్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

సమష్టి సహకారంతో..
## శాంతి భద్రతల పరిరక్షణ
- నాగర్‌కర్నూల్ ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నాగర్‌కర్నూల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలు, ఆయా పార్టీల నాయకుల సమష్టి సహకారంతో శాంతి భద్రతలు బాగున్నాయని నాగర్‌కర్నూల్ ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ స్పష్టం చేశారు. జిల్లాలోని పోలీసు యంత్రాగంలో జవాబుదారీతనం పెరగడంతో పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం బలపడుతోందన్నారు. గతంలో పోల్చితే నేరాల నియంత్రణకు తీసుకున్న కట్టుదిట్టమైన చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయని పేర్కొన్నారు. తరుచు చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలు కొంత ఆందోళన కల్గిస్తున్నాయని, ఈ ఏడాది కనీసం 25 శాతం రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించినట్లు ఎస్పీ మంగళవారం ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో తెలిపారు.

**మీ కుటుంబ నేపథ్యం ఏమిటి?**

మా స్వగ్రామం మహారాష్ట్రలోని హైమత్ నగర్ జిల్లా పింపల్‌గాం గ్రామంలో మా నాన్నకు నలుగురు సంతానం. అమ్మ గృహిణి, నాన్న కిరాణం షాపు నడిపేవారు. నా ప్రాథమిక విద్యాభ్యాసం అంతా స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో కొనసాగింది. ఆ తర్వాత హైమత్ నగర్‌లో ఇంటర్, డిప్లామా పూర్తి చేశాను. పుణెలో డిగ్రీ తర్వాత ప్రైవేట్ కంపెనీలో మెకానికల్ ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరాను.

**ఐపీఎస్ కావాలనే ఆలోచన ఎందుకు వచ్చింది?**

నేను చదువుకునే రోజుల్లో కూడా పబ్లిక్ రిలేషన్ బాగా మెయిన్‌టేన్ చేసేవాడిని. సామాన్య ప్రజలకు ఏదో చేయాలని తపన, తాపత్రయం బలంగా ఉండేది. మెకానికల్ ఇంజనీర్‌గా నాకు ఉన్న పరిమితులు ఎమిటో తెలిసిపోయాయి. నా కుటుంబానికి తప్పా సమాజానికి మేలు చేయలేననే భావన ఏర్పడి సివిల్ సర్వీస్‌కు సిద్ధమయ్యాను. మూడు సార్లు ర్యాంక్ రాకపోయినా నిరాశ పడలేదు. నాలు గో ప్రయత్నంలో సివిల్ సర్వీస్ సాధించి ఐపీ ఎస్‌గా ఎంపికయ్యాను. నల్గొండలో శిక్షణను పూర్తి చేసి గ్రేహ్యాండ్స్ పెద్దపల్లి డీసీపీగా, ఆ తర్వాత నాగర్‌కర్నూల్ ఎస్పీగా పనిచేసే అవకాశం వచ్చింది.

**జిల్లా పై మీ అభిప్రాయం ఏమిటి..?**

ఇక్కడ ప్రజలు, నాయకులు చాలా పరిణితి చెందినవారు. ఘర్షణలు, అశాంతి వాతావరణానికి దూరంగా ఉంటారు. ఈ విషయం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. విషయం ఏమిటంటే భార్యభర్తల మధ్య వివాదాలు, భూ పంచాయితీలు, ఆత్మస్థైర్యం కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడడం వంటివి ప్రధానంగా నాదృష్టికి వచ్చాయి. దీనిపై క వ ఎ్యానిటీ అవేర్‌నెస్ ప్రో గ్రాం చేపట్టాలని నిర్ణయించాం.

**రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?**

శ్రీశైలం రహదారి ఆమన్‌గల్లు, వెల్దండ, కల్వకుర్తి, అచ్చంపేట, మున్ననూరు ప్రాంతాల్లో తరుచు ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించాం. ఈ రహదారిపై ప్రమాదాల నివారణ కు రెవెన్యూ, ఆర్ అండ్ బీ, పోలీసు శాఖల ద్వారా సంయుక్త సమావేశాలు నిర్వహించి బ్లాక్ స్పాట్లను గుర్తించాం. కల్వకుర్తి, నాగర్‌కర్నూల్‌లలో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. ఆమన్‌గల్లు నుంచి కల్వకుర్తి వరకు లింకింగ్ లైట్లు బిగిస్తున్నాం. జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తిలలో ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లు కూడా మంజూరు ఆయ్యాయి. త్వరలోనే వాటిని ప్రారంభిస్తాం.

**మిగతా నేరాల పరిస్థితి ఏలా ఉంది?**

2024లో 277 కేసులు నమోదు అయ్యాయి. గతేడాది దొంగతనాలను ఆరికట్టేందుకు సీసీ కెమెరాలతో నిఘాను కట్టుదిట్టం చేశాం. పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది కొరత తగ్గిపోయినందున పెట్రోలింగ్ వ్యవస్థను పెంచాం. 2024లో 33 హత్యలు జరిగాయి. అందులో నిందితులను ఆరెస్టు కోర్టులో హాజరుపరిచాం. సైబర్ నేరస్థుల వలలో పడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరగడం కొంత ఆందోళన కలిస్తుంది. దీనిపై పూర్తి స్థాయిలో అవ గాహన కల్పిస్తున్నాం. సైబర్ నేరాలకు సంబంధించి 2024లో 95 కేసులు నమోదు అయ్యాయి. ఇందులో రూ.3,22,48,040 బాధితులు నష్టపోయారు. ఇప్పటి వరకు రూ.10,08,010 రికవరీ చేశాం.

**పోలీసుల సంక్షేమానికి కృషి చేస్తున్నారా..?**

ప్రజల పట్ల పోలీసుల్లో జవాబుదారీ తనాన్ని పెంపొందిస్తూనే వారి సంక్షేమం కోసం కూడా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం. పోలీసులు వారి కుటుంబ సభ్యులందరికీ నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించాం. వాటర్ ప్లాంట్, జిమ్, వాలీబాల్ కోర్టు, ఇండోర్‌కోర్టు, టెన్నిస్ కోర్టులను నిర్మించాం. పోలీసు శాఖ తరుఫున జిల్లా కేంద్రంలో పెట్రోల్ కేంద్రం కూడా ఏర్పాటు చేసి దాని ద్వారా వచ్చే ఆదాయాన్ని పోలీసుల సంక్షేమానికి వినియోగిస్తున్నాం.




## ‘బెల్ట్’ తీసేవారేరి..?
జోగుళాంబ గద్వాల జిల్లాలో అక్రమంగా మద్యం దందా
- క్వార్టర్‌పై రూ. 30, బీరుపై రూ.20 దాకా పెంపు
- ఒక్కో గ్రామంలో నాలుగుకు పైగానే బెల్ట్‌షాపులు
- గతంలో పట్టుబడినా మళ్లీ కొనసాగింపు

రాష్ట్రంలోనే ఎక్కడా లేనంత మద్యం అమ్మకాలు జోగుళాంబ గద్వాల జిల్లాలో జరుగుతున్నాయి. ఇక్కడ మద్యం దుకాణాలు ఎన్ని ఉన్నా అంతకంటే ఇరవై రెట్లకు పైగానే బెల్ట్‌దుకాణాలు నడుపుతున్నారు. ఈ జిల్లాలో బెల్ట్‌షాప్ లేని ఊరంటూ లేదని చెప్పుకునే స్థాయిలో దుకాణాలు నడుపుతున్నారు.

7

- గద్వాల క్రైం, ఆంధ్రజ్యోతి


మార్కెట్ యార్డు ముందు ధర్నా చేస్తున్న రైతులు

గన్నీ బ్యాగుల కోసం
## రైతుల ఆందోళన
- ‘పేట’ వ్యవసాయ మార్కెట్ గేటు ముందు ధర్నా

6

ఆపరేషన్ కగార్‌ను
## వెంటనే నిలిపివేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

వార్త 7లో..

## తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు

▸▸ బాలానగర్ మండలంలో పాఠశాలల పరిశీలన



కలెక్టర్ విజయేందిరబోయితో పబ్లిక్‌స్కూల్ ఏర్పాటు అంశంపై సమావేశమైన తెలంగాణ విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

బాలానగర్, మే 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటున్నట్లు విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ మండలంలోని పెద్దరేవల్లి, ఉడిత్యాల, బాలానగర్‌లలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలను మంగళవారం ఆయన పరిశీలించారు. భవనాలు, ఖాళీ స్థలం, సౌకర్యాలు, సమీపంలో ఉన్న పాఠశాలల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లారు. కలెక్టర్ విజయేందిరబోయి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్‌లతో సమావేశమయ్యారు. పబ్లిక్ స్కూల్ ఏర్పాటు, ఏర్పాటు చేయాల్సిన వసతులపై చర్చించారు. కార్యక్రమంలో డీఈవో ప్రవీణ్‌కుమార్, ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, బీడబ్ల్యూవో జరీనాబేగం, బాలానగర్ ఎంఈవో శంకర్ పాల్గొన్నారు.

## పీయూ అధ్యాపకుల సంఘం కార్యవర్గం ఎంపిక

▸▸ అధ్యక్షుడిగా ప్రొఫెసర్ జైపాల్ రెడ్డి



నూతన కార్యవర్గ పత్రాన్ని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్ బాబుకు అందజేస్తున్న రెగ్యులర్ అధ్యాపకులు

పాలమూరు యూనివర్సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ రెగ్యులర్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడిగా ప్రొఫెసర్ జైపాల్ రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. పాలమూరు యూనివర్సిటీలో మంగళవారం అధ్యాపకుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జనరల్ సెక్రెటరీగా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కిషోర్, ముఖ్య సలహాదారుగా పిండి పవన్ కుమార్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ నూర్జహన్, డాక్టర్ చంద్రకిరణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కార్యవర్గం వివరాలను పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్‌బావుకు అందించారు.

## ముక్కన్న చెరువు ముంపు భూముల రీసర్వే

▸▸ నష్టపరిహారం ఇవ్వాలని కోరిన రైతులు



మల్లేపల్లి ముక్కన్న చెరువు వద్ద సర్వేకు వచ్చిన అధికారులతో మాట్లాడుతున్న రైతులు

ఊట్కూర్, మే 6 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండలం, మల్లేపల్లి గ్రామ సమీపంలోని ముక్కన్న చెరువు ముంపు భూములను అధికారులు మంగళవారం రీ సర్వే చేశారు. వివరాలిలా ఉన్నాయి. ముక్కన్న చెరువు కింద ఆయకట్టు పెంపున కు 2000 సంవత్సరంలో నీటి పారుదల శాఖ అధికారులు 0.38 మీటర్ల మేర అలుగు ఎత్తును పెంచారు. దీంతో చెరువు వెనుక భాగంలోని మల్లేపల్లి, చిన్నపొర్ల గ్రామాలకు చెందిన రైతుల భూములు మునిగిపోతున్నాయి. గతంలో అధికారులు సర్వే చేసి 23 ఎకరాలు మాత్రమే ముంపునకు గురవుతున్నట్లు గుర్తించి, రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని నిర్ణయించారు. కానీ 55 మందికి చెందిన 59.5 ఎకరాల భూములు ముంపునకు గురవుతున్నాయని, అందరికీ నష్టపరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ఇరు పక్షాల వాదనలను విన్న కోర్టు భూములను రీసర్వే చేసి, భూములను కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు నారాయణపేట ఆర్డీవో ఉత్తర్వులు జారీ చేయడంతో నీటిపారుదల శాఖ ఈఈ బ్రహ్మానంద్, డీఈ కేతన్ కుమార్, ఏఈ వెంకటప్ప, డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ సర్వే అధికారులతో కలిసి భూములు కోల్పోతున్న రైతుల వివరాలు సేకరించారు. భూములను రీ సర్వే చేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ జయశంకర్, సీనియర్ అసిస్టెంట్ రాఘవేందర్‌రెడ్డి, ఇతర అధికారులు, చిన్నపొర్ల మాజీ సర్పంచ్ ఎం. రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

లారీలో లోడింగ్ పనులు పూర్తి చేస్తున్న హమాలీలు



# ఐదేళ్లుగా.. భారంగా..!

## రైతులపైనే హమాలీ చార్జి

▸▸ వరి కొనుగోలు కేంద్రాల్లో ఇదీ తంతు

▸▸ ప్రభుత్వాలు మారినా తీరు మారలే...

▸▸ కాంగ్రెస్ ప్రభుత్వమైనా కరుణ చూపాలంటున్న రైతులు

అయిజ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వరి కొనుగోలు కేంద్రాల్లో హమాలీ భారం రైతు పైనే పడుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మొదలుకుని నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వరకు 5 సంవత్సరాలుగా ఈ తంతు సాగుతూనే ఉంది. ఈ రబీ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో 49, సింగిల్‌విండో ఆధ్వర్యంలో 15, మెప్మా ఆధ్వర్యంలో 5 కొనుగోలు కేంద్రాలు నిర్వహించబడుతున్నాయి. ప్రస్తుతం జిల్లా మొత్తంగా 69 వరి కొనుగోలు కేంద్రాలు నిర్వహించబడుతున్నాయి.

### హమాలీ భారం

కొనుగోలు కేంద్రాల్లో హమాలీ చార్జీల భారం మాత్రం ఈసారి నెత్తిన పడబోతోంది అంటున్నారు రైతులు. తెచ్చిన ధాన్యం తూకం వేసి సంచుల్లో నింపి లోడింగ్ చేయటానికి క్వింటాకు రూ. 55 నుంచి రూ. 60 వరకు హమాలీలు వసూలు చేస్తున్నారు. గతంలో రూ. 50 వసూలు చేశారు. హమాలీ చార్జీలు ముందు రైతులు చెల్లిస్తే తర్వాత వారి వారి బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం జమ చేస్తాం అంటోంది. కానీ ఇప్పటి వరకు జమ చేసిన సందర్భాలు లేవని రైతులు తెలిపారు.

గత 5 సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం చెల్లించింది లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఖరీఫ్‌లోను చెల్లించలేదని వాపోతున్నారు.. ఈసారి కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఈ రబీలో జిల్లా వ్యాప్తంగా లక్షా 70 వేల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

5 సంవత్సరాలుగా ఖరీఫ్, రబీ కలుపుకుం టే 10 విడతల్లో దాదాపు రూ. 70 కోట్ల వరకు రైతులకు హమాలీ కింద చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ రబీలో లక్షా 70 వేల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా అధికారులు ఎంచుకున్నారు.



చిన్నతాండ్రపాడులో ధాన్యం తరలింపునకు బస్తాలను సిద్ధం చేస్తున్న హమాలీలు

### హమాలీ భారం ప్రభుత్వం భరించాలి



హమాలీ చార్జీలు ప్రభుత్వం భరించాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోను చెల్లించాం. ఇప్పుడు చెల్లించాలంటే ఇబ్బందిగా మారుతోంది. రైతులకు నష్టం కలిగించే నిర్ణయాలు ప్రభుత్వాలు తీసుకోకూడదని కోరుకుంటున్నాం. వెంటనే హమాలీ చార్జీలు రైతుల నుంచి తీసుకోకుండా చూడాలి.

- రాముడు, రైతు అయిజ

### కాంగ్రెస్ ప్రభుత్వం కరుణ చూపాలి



అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై కరుణ చూపాల్సి ఉంది. రైతులపై ఎరువుల భారం, కూలీల భారం, విత్తనాల భారం మోయాలంటే మా వల్ల కాదు. కాబట్టి రైతు ప్రభుత్వం అయిన కాంగ్రెస్ కరుణ చూపి హమాలీ భారం పడకుండా చూడాలి.

- సంజన్న, రైతు పర్దిపూర్

### రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం



వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తెచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. సకాలంలో గన్నీ బ్యాగులు అందజేస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న బోనస్ క్వింటాకు రూ. 500 నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలో జమ అవుతున్నాయి. హమాలీ చార్జీల చెల్లింపునకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. వచ్చిన వెంటనే అమలు చేయటానికి కృషి చేస్తాం.

- అవుల స్వామికుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి

## పుణె నిపుణుల కమిటీ నివేదిక మరింత ఆలస్యం..!

(5వ పేజీ తరువాయి...)

పరిశీలించారు. భవిష్యత్తులో సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన అంశాలపై సుదీర్ఘ నివేదికలను అందిస్తామని నిపుణుల బృందం తెలిపింది. కానీ వారు చెప్పిన మాటలు తలకిందులు అయ్యాయి. పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలంటే మరో 15రోజులు ర్యాలంపాడు రిజర్వాయర్ వద్ద ఉండి పరిశీలించాలని తేల్చిచెప్పారు. దీంతో పనులు పెండింగ్‌లో పడడంతో ఈ ఏడాది కూడా 2 టీఎంసీలకే పరిమితం అయ్యే అవకాశం ఉంది.

### మూడేళ్ల క్రితమే నిపుణుల కమిటీ నివేదిక

ర్యాలంపాడు రిజర్వాయర్ 2012 నుంచి 2020వరకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగునీటిని అందించింది. అయితే 2020లో లీకేజీల సమస్య మొదలైంది. 2021నాటికి మరింత పెరిగి రిజర్వాయర్ కట్టపై వత్తిడి పెరిగింది. దానికిందనే ర్యాలయంపాడు గ్రామం ఉండటంతో 2021 అక్టోబరులో నిపుణుల కమిటీ పరిశీలించి 4 టీఎంసీల నుంచి 2టీఎంసీలకు నిల్వ సామర్థ్యం తగ్గించి మరమ్మతులకు నివేదించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతీ ఏడాది రబీలో క్రాప్ హాలిడే ప్రకటిస్తున్నారు. ప్రభుత్వం 2022 మార్చిలో సర్వే నిర్వహించేందుకు రూ.93లక్షలతో టెండర్ల ద్వార ప్రయివేటు ఏజెన్సీకు అప్పగించింది. అదే ఏడాది సెప్టెంబరులో నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చినప్పటికీ గత ప్రభుత్వం కాలయాపన చేసింది.

### నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



ర్యాలంపాడు, ముచ్చోనిపల్లి రిజర్వాయర్ల మరమ్మతుల పూర్తిస్థాయి పరిశీలన కోసం పుణె నిపుణుల కమిటీ రూ.1.80కోట్లకు అంచనా వేసింది. కమిటీ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం అంగీకరిస్తే సరే లేదంటే ఇదివరకు ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న ఫైల్‌ను ఫైనలైజ్ చేయమని కోరుతాము. ఇంకా ప్రభుత్వం నుంచి ఎలాంటి నిర్ణయం రాలేదు.

- రహిముద్దీన్, ఎస్ఈ ఇరిగేష్ శాఖ గద్వాల

## ప్రెస్‌క్లబ్ ఎన్నికల్లో ఇండిపెండెంట్ ప్యానల్ ఘన విజయం

▸▸ అధ్యక్షుడిగా నరేంద్రచారి, ప్రధాన కార్యదర్శిగా జి. నరేందర్ గౌడ్



అధ్యక్షుడిగా ఎన్నికైన నరేంద్రచారి



ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన జి నరేందర్ గౌడ్



కోశాధికారిగా ఎన్నికైన యాదయ్య

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ ప్రెస్‌క్లబ్ ఎన్నికల్లో ఇండిపెండెంట్ ప్యానల్ ఘన విజయం సాధించింది. సుదీర్ఘకాలంగా ప్రెస్ క్లబ్‌కు ఎన్నికలు నిర్వహించపోవడం వల్ల ఇంతకాలం ప్రెస్‌క్లబ్ నిర్వహణ లేకుండా పోయింది. మంగళవారం పోలింగ్ నిర్వహించగా మొత్తం 252 ఓట్లుకు గాను 245 ఓట్లు పోలయ్యాయి. ఒక్క జాయింట్ సెక్రటరీ పోస్టులో టీడబ్ల్యూజేఎఫ్ గెలుపొందగా మిగతా పాలకవర్గంలోని అన్ని పోస్టులను ఇండిపెండెంట్ ప్యానల్ కైవసం చేసుకున్నది. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా హెచ్ఎం టీవీ కరస్పాండెంట్ నరేంద్రచారి విజయం సాధించగా, ప్రధాన కార్యదర్శిగా ఆంధ్రజ్యోతి జిల్లా ఇన్‌చార్జి జి. నరేందర్ గౌడ్, కోశాధికారిగా సాక్షి విలేకరి యాదయ్య విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా అంజిలయ్య, అక్కల ధరణి కాంత్, చింతకాయల వెంకటేష్ విజయం సాధించారు. జాయింట్ సెక్రటరీలుగా మణిప్రసాద్, సతీష్ కుమార్, జి. కృష్ణ విజయం సాధించారు. ఈసీ మెంబర్లుగా అబ్దుల్ అహద్ సిద్ధిఖీ, రాంకొండ, మోహన్ దాస్, రవికుమార్, షాబుద్దిన్ ముల్లా, వెంకటరమణలు విజయం సాధించారు. ప్రెస్‌క్లబ్ ఎన్నికల్లో ఇండిపెండెంట్ ప్యానల్ విజయం సాధించడంతో జర్నలిస్టులు సంబురాలు జరుపుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఇండిపెండెంట్ ప్యానల్ తరుపున పోటీచేసి విజయం సాధించడం సంతోషంగా ఉన్నదన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి యూనియన్లకతీతంగా కృషి చేస్తామన్నారు. ఎన్నికల అధికారిగా ప్రముఖ న్యాయవాది బెక్కం జనార్దన్ వ్యవహరించారు. ఎన్నికల సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## గన్నీ బ్యాగుల కోసం రైతుల అందోళన

▸▸ 'పేట' వ్యవసాయ మార్కెట్ గేటు ముందు ధర్నా

▸▸ ధాన్యం వాహనాల రాకపోకలకు అంతరాయం



పేట సింగిల్‌విండో దగ్గర బ్యాగుల కోసం రైతాంగాం పడిగాపులు

నారాయణపేట, మే 6 (ఆంధ్రజ్యోతి) : గన్నీ బ్యాగుల కోసం రైతులు అందోళన చేపట్టారు. మంగళవారం నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డు గేటు ముందు ధర్నా చేశారు. దీంతో ధాన్యం వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పట్టణంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మెప్మా కొనుగోలు కేంద్రంలో గన్నీ బ్యాగులు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. నాలుగు రోజులుగా తిరుగుతున్నా సంచులు ఇవ్వడం లేదని రైతులు ఆగ్రహించారు. మెప్మా కేంద్రానికి వచ్చిన గన్నీబ్యాగులను సింగిల్ విండోకు తరలించడాన్ని నిరసిస్తూ గేటు మూసి అందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న మార్కెట్ చైర్మెన్ శివారెడ్డి ఫోన్‌లో సివిల్ సప్లయ్ అధికారులతో మాట్లాడారు. 15 వేల గన్నీ బ్యాగులను మెప్మా కేంద్రానికి పంపించాలని రైతులు కోరడంతో త్వరలో వస్తాయని వారికి నచ్చచెప్పి అందోళన విరమింపచేశారు. మెప్మా కేంద్రంలో ఇప్పటి వరకు 53 వేల గన్నీ బ్యాగులను రైతులకు అందించామని అధికారులు తెలిపారు. 32 వేల బస్తాలను రైతులు కేంద్రానికి తెచ్చారని చెప్పారు. ఇంకా 15 వేల గన్నీ బ్యాగులు అవసరం ఉన్నట్లు సివిల్ సప్లయ్ అధికారులకు విన్నవించినట్లు తెలిపారు. పట్టణంలోని సింగింల్ విండో కొనుగోలు కేంద్రంలో కూడా గన్నీ బ్యాగుల కొరత ఏర్పడటంతో రైతులు ఇబ్బంది పడ్డారు. తీరా ఐదు వేల బ్యాగులు రావడంతో రైతులకు అందించారు.



నిడ్జింత గ్రామంలో కోట మైసమ్మదేవికి ఊరేగింపుగా జల్దిబిందె తీసుకువస్తున్న గ్రామస్థులు

## ఘనంగా కోటమైసమ్మ దేవి ఉత్సవాలు

కొత్తపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): పేట జిల్లా కొత్తపల్లి మండలంలోని నిడ్జింత గ్రామంలో కోట మైసమ్మ దేవి జాతర మహోత్సవాలు గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జల్దిబిందెలో నీటిని తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. మహిళలు గ్రామ పురవీధుల గుండా బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



నిడ్జింత గ్రామంలో అలంకరణ అనంతరం కోట మైసమ్మదేవి

# కేజీబీవీలు అప్‌గ్రేడ్

▸▸ ఈ ఏడాది నుంచి ఇంటర్‌లో ఆధునిక కోర్సులు ప్రారంభం

నాగర్‌కర్నూల్ టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల్లోని 19 కేజీబీవీలను అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని 9 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను (కేజీబీవీ) ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేశారు. ఇప్పటి వరకు 11 కేజీబీవీల్లో ఇంటర్ వరకు తరగతులు కొనసాగిస్తుండగా, ఇప్పుడు అప్‌గ్రేడ్ అయిన 9 కేజీబీవీలతో కలిపి జిల్లాలో మొత్తం 20 కేజీబీవీల్లో ఇంటర్ వరకు విద్యను అందించనున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి జిల్లాలోని అచ్చంపేట, పదర, కోడేరు, పెద్దకొత్తపల్లి, తాడూరు, తిమ్మాజిపేట, ఉప్పునుంతల, ఊర్కొండ, వంగూరు కేజీబీవీల్లో ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించనున్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు 200 మందికి, ఇంటర్ వరకు అయితే 360 మంది విద్యార్థినులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు.

### ఈ ఏడాది ఆధునిక కోర్సులు

జిల్లాలో ఇప్పటి వరకు ఇంటర్ వరకు కొనసాగిన 11 కేజీబీవీల్లో ఏడింటిలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ వంటి సాధారణ కోర్సులు నిర్వహిస్తుండగా బిజినేపల్లి, తెల్కపల్లి, కల్వకుర్తి, బల్మూరు కేజీబీవీల్లో సాధారణ కోర్సుతో పాటు ఎంపీహెచ్‌డబ్ల్యూ ఒకేషనల్ కోర్సు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఈ విద్యా సంవత్సరం నుంచి అప్‌గ్రేడ్ పొంది నూతనంగా ఇంటర్ తరగతులు నిర్వహించనున్న 9 కేజీబీవీల్లో సాధారణ కోర్సులతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, కంప్యూటర్ సైన్స్, అకౌంటింగ్ వంటి ఆధునిక, సాంకేతిక కోర్సులు నిర్వహించనున్నారు. వాటిలో పదర కేజీబీవీలో అకౌంటింగ్ కోర్సును ప్రవేశపెట్టనుండగా అచ్చంపేట, కోడేరు, ఊర్కొండ, పెద్దకొత్తపల్లి కేజీబీవీల్లో కంప్యూ టర్ సైన్స్, ఆర్టిఫిషియన్ ఇంటలిజెన్స్ కోర్సును ప్రవేశపెట్టనున్నారు.



కేజీబీవీలో ఇంటర్ ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థినులు(ఫైల్స్)

● వనపర్తి జిల్లాలో మొత్తం 14 కేజీబీవీలు ఉన్నాయి. వీటిలో ఇది వరకే 5 పాఠశాలల్లో ఇంటర్ తరగతులు బోధిస్తున్నారు. ఈ ఏడాది నుంచి నూతనంగా మరో 6 కేజీబీవీలు ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేస్తు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వీటిలో కొత్త కోర్సులను కూడా ప్రవేశపెట్టింది. ఖిల్లాఘణపురం, పాన్‌గల్, కేజీబీవీలో కంప్యూటర్ సైన్స్ ఏఐ, మదనాపురం కేజీబీవీలో ఫార్మా టెక్నాలజీ, కొత్తకోట కేజీబీవీలో అకౌంటింగ్, టాక్స్ , చిన్నంబావి కేజీబీవీలో బైపీసీ, ఎమ్మెల్టీ, రేవల్లి కేజీబీవీలో సీఈసీ, ఎమ్మెల్టీ తరగతులు బోధించనున్నారు.

● జోగుళాంబ గద్వాల జిల్లాలోని నాలుగు కేజీబీవీలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్ ఘని తెలిపారు. జిల్లాలో మొత్తం 12 కేజీబీవీలు ఉండగా ఇప్పటికే 6 కేజీబీవీలలో ఇంటర్ విద్య కొనసాగుతోంది. ఈ విద్యా సంవత్సరం నుంచి 4 కేజీబీవీల (ధరూర్, మల్దకల్, కేటీదొడ్డి, ఉండవల్లి) లో ఇంటర్ తరగతులు నిర్వహించనున్నారు. ఇటిక్యాల, రాజోలిలు మాత్రమే అప్‌గ్రేడ్ కావాల్సి ఉందని ఆయన తెలిపారు.

### విద్యా, వసతికి భరోసా



కేజీబీవీల్లో విద్యార్థినులకు చదువుతో పాటు భోజనం, ఇతర సౌకర్యాలను సమకూరుస్తున్నాం. ఇంటర్ పూర్తి కాగానే విద్యార్థినులు ఎంసెట్, నీట్, డీఈడీ ప్రవేశ పరీక్షలకు శిక్షణ అందిస్తున్నాం. వృత్తి విద్యా కోర్సులతో పాటు కుట్లు, అల్లికలు, కరాటే వంటి వాటిలో శిక్షణ ఇవ్వడంతో పాటు బాలికలకు భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్నాం.

- శోభారాణి, జిల్లా బాలికా విద్య అధికారి, నాగర్‌కర్నూల్

### కేజీబీవీలకు ఆదరణ పెరుగుతోంది..



పేదరికంతో అర్థాంతరంగా చదువుకు దూరమైన, తల్లిదండ్రులను కోల్పోయిన బాలికలకు కేజీబీవీలు బాసటగా నిలుస్తున్నాయి. 2005లో ఏర్పాటు చేసిన కేజీబీవీలకు మొదట్లో ఆదరణ తక్కువగా ఉన్నా ఇప్పుడు ప్రవేశాలకు పోటీ పెరిగింది. ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేసిన కేజీబీవీల్లో 2025-26 విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించి ఆధునిక, సాంకేతిక కోర్సులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

- రమేష్‌కుమార్, జిల్లా విద్యాధికారి, నాగర్‌కర్నూల్

## 'భూభారతి'తో సమస్యల పరిష్కారం

▸▸ జోగుళాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

ఇటిక్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి) : భూభారతితో రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని జోగుళాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. ఇటిక్యాల మండలం వావిలాల గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అవగాహన సదస్సులో మాట్లాడారు. భూభారతి చట్టం అమలులో భాగంగా ఇటిక్యాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం గతంలో ప్రజలు అధికారుల వద్దకు వెళాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం ప్రజల వద్దకే అధికారులు వచ్చి అర్జీలను స్వీకరిస్తున్నారని చెప్పారు. మొదటిరోజు గోపలదిన్నె గ్రామంలో 21 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. భూ సమస్యలు ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మాలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతులు ఎలాంటి ఫీజు చెల్లించకుండానే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. భూ విస్తీర్ణం, హెచ్చు తగ్గులు, వారసత్వ వివాదాలు, భూస్వభావం, తప్పుల సవరణ, సాదాబైనామాలు, తదితర అంశాలపై దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఇటిక్యాల, ఎర్రవల్లి తహసీల్దార్లు వీరభద్రప్ప, నరేశ్, ఏవో రవి కుమార్, డీటీ నందిని, మనోహర్, సర్వేయర్ దౌలమ్మ, మదన్‌మోహన్, అలీబాషా, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

## ఈతకు వెళ్లి బాలుడి మృతి

దేవరకద్ర, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఈత నేర్చుకునేందుకు స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర మండలంలోని వెంకటాయపల్లి గ్రామంలో ఈ విషాద సంఘటన జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భూత్పూర్ మండలం అన్నసాగర్ గ్రామానికి చెందిన పద్మ, వెంకటేశ్‌ల కుమారుడు సన్నీ (12) వేసవి సెలవులను గడిపేందుకు బంధువుల ఊరైన వెంకటాయపల్లికి వచ్చాడు. మంగళవారం బంధువుల పిల్లలతో కలిసి ఈత నేర్చుకునేందుకు గ్రామ సమీపంలోని స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లాడు. పూల్‌లో ఈత నేర్చుకుంటూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. విషయం తెలిసిన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు అక్కడికి చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకెళ్లారు.

## ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి



సంఘటనా స్థలంలో పంచనామా నిర్వహిస్తున్న ఎస్‌ఐ జగదీశ్వర్



సోమేశ్వర్ రెడ్డి (ఫైల్)

రాజోలి, మే 6 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండలంలో ఈ సంఘటన జరిగింది. రాజోలి ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మాన్‌దొడ్డి గ్రామానికి చెందిన సోమేశ్వర్‌రెడ్డి (51) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం అదే గ్రామానికి చెందిన ఉప్పరి నర్సింహులుకు చెందిన పొలంలో దుక్కులు దున్నేందుకు వెళ్లాడు. పని అయిపోయిన తర్వాత గ్రామానికి తిరిగి వస్తుండగా రోడ్డు మలుపు దగ్గర ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడటంతో సోమేశ్వర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని జిల్లా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందారు. సంఘటనపై మృతుడి భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపారు.

## ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

మల్దకల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండలం, మద్దెలబండ గ్రామంలో ఈ సంఘటన జరిగింది. మల్దకల్ ఎస్‌ఐ నందీకర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, నెల్లూరుకు చెందిన హరికృష్ణ, అనిత దంపతులు మూడు నెలల క్రితం మద్దెలబండ గ్రామంలో జ్యూస్ సెంటర్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. భర్త హరికృష్ణ మద్యానికి బానిసై తరచూ భార్యను అనుమానిస్తూ వేధింపులకు పాల్పడేవాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన అనిత ఈ నెల 5వ తేదీన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందడంతో మృతదేహాన్ని గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న అనిత తల్లి వెంకమ్మ ఈనెల 6న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

**అత్తింటి వేధింపులు భరించలేక...**

కల్వకుర్తి (ఆంధ్రజ్యోతి) : అత్తింటి వేధింపులను భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్నది. సంఘటనకు సంబంధించి కల్వకుర్తి ఎస్‌ఐ మాధవరెడ్డి కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మం డలం, మార్చాల గ్రామానికి చెందిన ప్రభావతి (38) అత్తింటి వారి వేధిం పులు భరించలేక సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయింది. పంజుగుల రోడ్డు సమీపంలోని కేఎల్‌ఐ కాల్వలో పడి ఆత్మహత్య చేసుకున్నది. మంగళవారం ఆమె మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు తెలిపారు. వారు సంఘటన చేరుకొని మృతదేహాన్ని బయటికి తీసి ఆసుపత్రికి తరలించారు. భర్త విష్ణు, ఆడపడుచు భీమమ్మ వేధింపులను భరించ లేక తమ అక్క ప్రభావతి ఆత్మహత్య చేసుకున్నదని తమ్ముడు ప్రకాశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు.

**తండ్రి మందలించడంతో..**

ఉండవల్లి (ఆంధ్రజ్యోతి) : పనికి వెళ్లాలని తండ్రి మందలించ డంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలంలోని బైరాపురం గ్రామంలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ మహేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కురువ దివాకర్‌కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు అరవింద్ కుమార్ (23) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. కొంత కాలంగా పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉండేవాడు. దీంతో మంగళవారం ఉదయం తండ్రి అతడిని తిట్టి పనిమీద బయటకు వెళ్లాడు. 10.30 గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చేలోగా ఆయనకు కుమారుడు అరవింద్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించాడు. దీంతో అతడిని దించి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సంఘటనపై తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

**అప్పుల బాధ ఎక్కువై..**

జడ్చర్ల (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధభరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీలో ఈ సంఘటన జరిగింది. సీఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, నంద్యాల జిల్లా, నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరుకు చెందిన రాజేశ్ (33), సురేఖ దంపతులు బతుకుదెరువు కోసం మూడు సంవత్సరాల క్రితం జడ్చర్లకు వలస వచ్చారు. కుటుంబ పోషణకు చేసిన అప్పులు అధికం కావడంతో రాజేశ్ మద్యానికి బానిసయ్యాడు. అప్పుల విషయంపై ఈ నెల 5న రాత్రి భార్యతో తన ఆవేదనను వ్యక్తం చేశాడు. అర్ధరాత్రి తర్వాత ఇంట్లోనే ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సురేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

**ముకురాలలో రైతు...**

కల్వకుర్తి (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ భరించలేక నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మండలంలోని ముకురాలలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. గ్రామానికి చెందిన కొత్త శ్రీనివాస్‌రెడ్డి (37) భార్య, తల్లితో కలిసి మంగళవారం ఉదయం పొలానికి వెళ్లి, ధాన్యాన్ని ఆరబోశారు. సాయంత్రం శ్రీనివాస్‌రెడ్డి ఒంటరిగా ఇంటికి వచ్చాడు. ఆ తర్వాత కొద్దిసేపటికి తల్లి, భార్య ఇంటికి చేరుకున్నారు. తలుపులు తీసి చూడగా శ్రీనివాస్‌రెడ్డి ఫ్యానుకు ఉరి వేసుకొని కనిపించాడు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు ఇంట్లో సూసైడ్ నోట్ లభించినట్లు సమాచారం.

## దంపతులను ఢీకొన్న లారీ

▸▸ భార్య మృతి, భర్తకు గాయాలు

జడ్చర్ల, మే 6 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన నిలబడి ఉన్న దంపతులను లారీ ఢీకొనడంతో భార్య అక్కడికక్కడే మృతి చెందింది. భర్తకు గాయాలయ్యాయి. సీఐ కమలాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలోని చైతన్యనగర్ కాలనీకి చెందిన దంపతులు అవుసలి శంకర్, విద్యావతి (38) గంగాపురం వెళ్లే దారిలోని శివాలయం పక్కన టీస్టాల్‌ను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి టీస్టాల్‌ను మూసివేసి ఇంటికి వెళ్లేందుకు రోడ్డుపై నిలబడ్డారు. అదే సమయంలో దేవరకొండ నుంచి రాయిచూర్ వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి వారిని ఢీకొని, టీస్టాల్‌పైకి దూసుకెళ్లింది. దీంతో విద్యావతి అక్కడికక్కడే మృతి చెందింది. శంకర్ గాయపడ్డారు. టీస్టాల్ పూర్తిగా దెబ్బతిన్నది. సంఘటనపై శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# 'బెల్ట్' తీసేవారేరి..?

**జోగులాంబ గద్వాల జిల్లాలో అక్రమంగా మద్యం దందా**

- ▸▸ క్వార్టర్‌పై రూ. 30, బీరుపై 20 దాకా పెంపు
- ▸▸ ఒక్కో గ్రామంలో నాలుగుకు పైగానే బెల్ట్‌షాపులు
- ▸▸ గతంలో పట్టుబడినా మళ్లీ కొనసాగింపు



గద్వాల క్రైం, మే 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో మద్యం అమ్మకాలు రోజు రోజుకు తారాస్థాయికి చేరుతున్నాయి. రాష్ట్రంలోనే ఎక్కడ లేనంత మద్యం అమ్మకాలు జోగుళాంబ గద్వాల జిల్లాలో జరుగుతున్నాయంటే ఇక్కడ మద్యం ప్రియులు ఏ రేంజ్‌లో ఉన్నారో ఇట్టే అర్థం అవుతుంది. ఇక్కడ మద్యం దుకాణాలు ఎన్ని ఉన్నా అంతకంటే పది, ఇరువై రెట్లకు పైగానే బెల్ట్‌దుకాణాలు ఉన్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. గ్రామాల్లో, మండలాల్లో బెల్ట్‌దుకాణాలు రోజురోజుకు పెరుగుతున్నా అధికారులు మాత్రం తమకేమి సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం దుకాణాల్లో అయితే మద్యం కోసం సమయం చూడాల్సి వస్తుంది. కానీ బెల్ట్‌దుకాణాల్లో అయితే ఏ అర్ధరాత్రి... అపరాత్రి అయినా ఇట్టే దొరుకుతుంది. ఈ జిల్లాలో బెల్ట్‌షాప్ లేని ఊరంటూ లేదనే చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

**గ్రామాల్లో కిరాణ కొట్టే బెల్టు దుకాణాల అడ్డా...**

గ్రామాల్లో, కొన్ని పట్టణాల్లో కిరాణ కొట్లే బెల్ట్ దుకాణాలకు అడ్డాగా మారుతున్నాయి. మరికొన్ని చోట్ల అయితే తడికెలు వేసి చిన్నసైజు కల్లు దుకాణంలా మార్చి బెల్ట్‌దుకాణాన్ని నడిపిస్తున్నారు. ఇక్కడే మద్యం అమ్మకాలు జోరందుకుంటున్నాయి. జిల్లా కేంద్రంలో అయితే ముఖ్యంగా శివారు కాలనీలలో ఎక్కువగా బెల్ట్‌దుకాణాలు ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గద్వాల మండలంలోని కాకులారం, పూడూరు, వీరాపురం, గోన్‌పాడ్, మేలచెర్వులో, అలంపూర్ డివిజన్‌లో అయితే కోనేరు, గుందిమల్ల, భీమవరం, క్యాతూరు, కాశీపురం, సింగవరం, గుందిమల్ల, సుల్తానాపురం, అయిజలో వెంకటాపురం, సింధనూరు, పులికల్, భూంపురం, మల్దకల్ మండలం ఎల్కూర్, మల్లెందొడ్డి, బిజ్వారం, రాజోలి, శాంతినగర్, వడ్డేపల్లిలో తదితర గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులలో మద్యం విక్రయిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇలా బెల్ట్‌దుకాణాలు ఉన్నట్లు అధికారులకు తెలిసినా కూడా నోరు మెదపక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ రేట్లకే విక్రయిస్తే ఇక బెల్ట్‌షాపుల్లో అయితే ఒక్కొక్క బాటిల్‌పై ఒక్కో రేటుతో వసూలు చేస్తున్నారు. క్వార్టర్‌పై అదనంగా రూ. 30కిపైగానే, బీరుపై రు. 20దాకా అధికంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇలా బెల్ట్‌దుకాణాల వల్ల ప్రభుత్వ ఖజానాకు గండిపడుతున్నది.



గద్వాల పట్టణంలోని పోలీసుల దాడుల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లు (ఫైల్)

**బెల్ట్ దుకాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం**



జిల్లాలోని బెల్ట్ దుకాణాలపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం. జనవరి నుంచి ఇప్పటివరకు 53 కేసులను నమోదు చేయడంతో పాటు 53మందిని అరెస్ట్ చేశాం. అలాగే 655 లీటర్ల లిక్కరు, 350 లీటర్ల బీర్లతో పాటు 10 వాహనాలను సీజ్ చేశాం. బెల్ట్‌దుకాణాలపై ప్రత్యే నిఘా ఉంచుతాం.

- గణపతిరెడ్డి, ఎక్సైజ్ సీఐ, గద్వాల

**గతంలో కేసులు చేసినా మళ్లీ అదే తంతు**

జిల్లాలో గతంలో కేసులు చేసినవారు కూడా మళ్లీ అదే తంతు కొనసాగిస్తున్నారు. ఉదాహరణకు గద్వాల పట్టణంలోని కొన్ని కాలనీల్లో కొందరిపై ఇప్పటికే చాలా సార్లు కేసులు అయ్యాయి. మళ్లీ అదేతంతుతో బెల్ట్‌దుకాణాన్ని నడుపుతున్నట్లు తెలుస్తున్నది. ఇలా పదే పదే నడపడంలో అధికారుల పాత్ర ఏమైనా ఉన్నదా? అన్న విషయాలు ఉన్నతాధికారులు తేల్చాల్సి ఉంది. వీరిపై పలుమార్లు ఎక్సైజ్, సివిల్ పోలీసులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నా ఎందుకు వీరు మళ్లీ అదే వ్యాపారం కొనసాగించడంలో అంతర్యం ఏమిటో అర్థం కావడంలేదు. అధికారులు స్పందించి వీరికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## గద్వాలలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

- ▸▸ 10 మందిపై కేసుల నమోదు
- ▸▸ ట్రైనీ ఎస్‌ఐ తరుణ్ సబ్బిరెడ్డి



డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న ట్రైనీ ఎస్‌ఐ తరుణ్ సబ్బిరెడ్డి

గద్వాల క్రైం, మే 6 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 10 మందిపై కేసులు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్‌ఐ తరుణ్ సబ్బిరెడ్డి తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కొత్త కలెక్టరేట్ ముందు మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ తనిఖీల్లో 10 పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

**ఒకరికి జైలు శిక్ష**

కల్వకుర్తి (ఆంధ్రజ్యోతి) : డ్రైంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు కల్వకుర్తి ఎస్‌ఐ మాదవరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన యాదయ్య ఇటీవల డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డాడు. మంగళవారం అతడిని కల్వకుర్తి కోర్టులో హాజరు పరచగా ఒక రోజు జైలు శిక్ష, రూ. 100 జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చారు.

## సెల్‌ఫోన్ల దుకాణంలో చోరీ

మక్తల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణం లోని హనుమాన్ మొబైల్ దుకాణంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. యజమాని మహేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి సమయంలో దొంగలు మొబైల్ దుకాణం తాళం విరగ్గొట్టి లోపలికి చొరబడారు. దుకాణంలోని రూ.6.50 లక్షలను ఎత్తుకెళ్లారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయని ఆయన తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

# ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

▸▸ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

వనపర్తి టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించడం సరైనది కాదన్నారు. కులగణనను ఎప్పటిలోగా పూర్తి చేస్తారో కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ముస్లింలలో ఫకీర్లు, పింజరులు, దూదేకులు తదితర వెనుకబడ్డ జాతులను మతం పేరుతో బీసీల్లో చేర్చొద్దనడం రాజ్యాంగ వ్యతిరేక చర్య అని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అన్ని గ్యారెంటీలను నూటికి నూరుశాతం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కేరళ ప్రభుత్వం తరహాలో రాష్ట్రంలోను పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రేషన్ దుకాణాల్లో 14 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని కోరారు. జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెకు సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్ధతు తెలుపుతోందన్నారు. అంతకుముందు కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ జబ్బార్, జీఎస్ గోపి, బాల్‌రెడ్డి, మండ్ల రాజు, లక్ష్మి, ఉమా, మేకల ఆంజనేయులు, ఆర్‌ఎన్ రమేశ్, బాల్య నాయక్, పరమేశ్వరాచారి పాల్గొన్నారు.

# మెడికల్ వేస్టేజీని బహిరంగంగా పారేయొద్దు



జిల్లా కేంద్రంలో బహిరంగ ప్రదేశంలో కనిపిస్తున్న మెడికల్ వేస్టేజీ



ప్రవేట్ ఆసుపత్రిలను తనిఖీ చేస్తున్న ప్రోగ్రాం అధికారి, వైద్యసిబ్బంది

- ▸▸ మాతా శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి ప్రసూనారాణి

గద్వాల క్రైం, మే 6 (ఆంధ్రజ్యోతి) : బయో మెడికల్ వేస్టేజీని బహిరంగంగా పారేస్తే చర్యలు తప్పవని మాతాశిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసూనారాణి అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్‌హోమ్‌లు, స్కానింగ్, ఫిజియోథెరపీ, డయాగ్నోస్టిక్ కేంద్రాలను మంగళవారం జిల్లా వైద్యాధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్, ఫైర్‌సేఫ్టీ, బయోమెడికల్ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాల ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులు, డయోగ్నోస్టిక్ కేంద్రాల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని, అవసరమైన అన్ని ధ్రువపత్రాలను కలిగి ఉండాలని సూచించారు. అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామ ని హెచ్చరించారు. తనిఖీల్లో జిల్లా వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది మధుసూధన్‌రెడ్డి, నరసయ్య పాల్గొన్నారు.

# నైపుణ్యాలను పెంచుకోవాలి

- ▸▸ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి



క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

పాలమూరు యూనివర్సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని పాలమూరు యూనివర్సిటీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. శ్రీచైతన్య టెక్నో స్కూల్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ పీజీ ఆడిటోరియంలో మంగళవారం ప్లేస్‌మెంట్స్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మనోధైర్యంతో సబ్జెక్ట్‌పై పట్టు సాధించి, ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. ఎంపికల కోఆర్డినేటర్ రాఘవేందర్‌బాబు రాతపరీక్ష, డెమో టీచింగ్‌లపై అవగాహన కల్పించారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు 56 మంది విద్యార్థులు హాజరయ్యారని, రాత పరీక్షలో ఉత్తీర్ణత పొందిన వారికి డెమో టీచింగ్ క్లాస్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్‌ఎన్ అర్జున్ కుమార్, గాలెన్న, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వెల్‌నెస్ సెంటర్



ప్రధాన ఆసుపత్రిని పరిశీలిస్తున్న సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు

మహబూబ్‌నగర్ టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వెల్‌నెస్ సెంటర్‌ను జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించాలనే నిర్ణయం కొలిక్కి వచ్చినట్లు సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, తెలంగాణ సెంట్రల్, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిల్‌గౌడ్ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. వెల్‌నెస్ సెంటర్ ప్రస్తుతం పాత డీఎంహెచ్‌వో కార్యాలయంలోని మొదటి అంతస్తులో కొనసాగుతోందన్నారు. దీంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వెల్‌నెస్ సెంటర్‌ను పట్టణ నడిబొడ్డునకు మార్చాలని పలుమార్లు కలెక్టర్ విజయేందిర బోయికి విన్నవించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్, డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణ, ఆర్ఎంవో జరీనాలతో కలిసి జిల్లా ప్రధాన ఆసుపత్రిలోని వివిధ గదులను పరిశీలించారు. ఆసుపత్రి వెనుక భాగంలో అన్ని వైద్య సేవలు అందుబాటులో ఉన్న రెండు పెద్ద గదులను కేంద్రం నిర్వహణకు ఎంపిక చేశారు. త్వరలోనే ఆ గదుల్లోకి వెల్‌నెస్ సెంటర్‌ను మారుస్తామని తెలిపారు. వారి వెంట ఫోరం ప్రధాన కార్యదర్శి నస్కంటి నాగభూషణం, వెంకట్ తదితరులున్నారు.

## ఇంటర్వ్యూ

### దళారులను నమ్మి మోసపోవద్దు
### - వ్యవసాయ అధికారి రాజవర్ధన్‌రెడ్డి



పాన్‌గల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు దళారులకు విక్రయించి మోసపోవద్దని, ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలని వ్యవసాయ అధికారి రాజవర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై మాట్లాడారు.

**మండలంలో ఎన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు?**

మండలంలోని సింగిల్‌విండో ద్వారా 22, ఐకేపీ ద్వారా 14 మొత్తం 26 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

**ధాన్యం అమ్మిన రైతులకు టోకెన్లు ఎప్పుడు ఇస్తారు?**

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తేమ శాతం వచ్చిన తరువాత అక్కడే ఏఈవోలు టోకెన్లు అందజేస్తారు.

**కొనుగోలు కేంద్రాలు రైతులకు సౌకర్యవంతంగా ఉన్నాయా?**

రైతులకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశానుసారం తాగునీరు, టెంటు, తాలు వేరు చేసేందుకు ఫ్యాన్లను ఏర్పాటు చేశాం.

**రైతులకు మీరు ఇచ్చే సూచనలు?**

ధాన్యాన్ని తాలు లేకుండా ఏర్పాటు చేసుకునేందుకు అవగాహన కల్పిస్తున్నాం. అలాగే ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మి రైతులు మద్ధతు ధరను పొందాలి.

## న్యూస్ బాక్స్

### పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుకు దరఖాస్తులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మే 6 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థలో 2025-26 సంవత్సరానికి గాను మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ డిప్లోమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన తల్లి లేదా తండ్రి కోల్పోయిన బాలికలు ఇతర నిరాశ్రయ బాలికలు, అక్రమ రవాణాకు గురైన బాధిత బాలికలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. ప్రతీ కోర్సులో 60 సీట్లకు గాను మొత్తం 240 సీట్లలో 70 శాతం సీట్లు వీరికి కేటాయిస్తామని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ అర్హత ప్రవేశ పరీక్ష రాయకున్నా.. కనీసం పదో తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలని తెలిపారు. ఎంపికైన బాలికలకు ఉచిత విద్యతో పాటు వసతి సౌకర్యం కల్పిస్తారని చెప్పారు. దరఖాస్తు ఫారాలను మే నెల 15వ తేదీలోగా జిల్లా కేంద్రంలోని బాల రక్ష భవన్‌లో సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

### మునిసిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు

అమరచింత, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 29న జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా మంగళవారం అమరచింత మునిసిపల్ కమిషనర్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ఎన్ రమేష్ మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తు ప్రజలకు కార్మికులకు తీవ్ర అన్యాయానికి గురి చేస్తుందని ఆయన విమర్శించారు. ప్రభాకర్, హరికృష్ణ, సునీల్, చిన్న, మహేందర్, రవి, ప్రదీప్, కతల్, మాధవి, పుష్పమ్మ పాల్గొన్నారు.

### పల్లెల్లో వైద్యం మెరుగుపరచాలి



మాట్లాడుతున్న నోడల్ అధికారి వంశీకృష్ణ

వీపనగండ్ల, మే 6 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో వైద్యం మెరుగుపరచాలని పల్లె దవాఖానాల డాక్టర్లకు నోడల్ అధికారి డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన కార్యదర్శి కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వర్ధన్ భాగ్యశ్రీ, శ్వేత, కర్ణశ్రీ, కవిత, కేశవులు, విజయకుమారి పాల్గొన్నారు.

### అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు సహకరించాలి

పెబ్బేరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు గ్రామస్థులు కలిసకట్టుగా ఉండి ఏర్పాటు చేసుకోవాలని రైతు సంఘం నాయకులు సూచించారు. మంగళవారం గుమ్మడంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామంలో ప్రభుత్వ స్థలం ఉన్న చోట నిర్మించుకోవాలని దళిత సంఘం నాయకులు, ఆ ప్రదేశంలో ఎలాంటి విగ్రహాలు పెట్టరాదని గ్రామం యువత మధ్య సమన్వయం లేకపోవడంతో విగ్రహం ఏర్పాటు చేసుకోవడం లేదన్నారు. గ్రామంలోని అన్ని యువజన సంఘాలు. గ్రామపెద్దల సహకారంతో విగ్రహం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎవరూ గొడవలు పడవద్దన్నారు. రైతు కమిటీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పేదింటి విద్యార్థులకు మెరుగైన విద్య

### - ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి విద్యావిభాగం, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శ పాఠశాలల్లో ఉత్తమ విద్యను అందిస్తుండటంతో ఏటా మంచి ఫలితాలు సాధిస్తున్నాయి. దీంతో గ్రామీణ విద్యార్థులు ఆదర్శ పాఠశాలల్లో చేరడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రైవేటు పాఠశాల, కళాశాలలకు దీటుగా ఆదర్శ పాఠశాలల్లో ఉత్తమ ఉపాధ్యాయులచే విద్యను అందిస్తుండడంతో ఎక్కువ మంది విద్యార్థులు ఈ పాఠశాలలో ప్రవేశం పొందడానికి మక్కువ కనబరుస్తున్నారు. అధునాతన తరగతి గదులు, ఆంగ్ల మాధ్యమంలో బోధన, ప్రయోగశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు బోధిస్తుండడంతో ఇంటర్ ప్రవేశాలకు తీవ్ర పోటీ నెలకొంది. ఇటీవల పది ఫలితాలు విడుదలవడంతో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో ప్రవేశాల కోసం మే 5 నుంచి ఈ నెల 20 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జూన్ 2 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

**జిల్లా వ్యాప్తంగా 480 సీట్లు**

వనపర్తి జిల్లాలో పెబ్బేరు, ఖిల్లాఘణపూర్, కొత్తకోటలో ఆదర్శ పాఠశాల, కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో కోర్సులో 40 సీట్లకు ప్రవేశం ఉంటుంది. ఒక్కొక్క కళాశాలలో మొదటి సంవత్సరానికి 160 సీట్ల చొప్పున మూడు కళాశాలల్లో కలిపి 480 సీట్లు ఖాళీగా ఉన్నాయి. దరఖాస్తు చేసుకున్న వారిలో 10వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను ఎంపిక చేస్తారు.

**హాస్టల్ సదుపాయం**

కళాశాలలో చేరిన వారిలో వంద మంది విద్యార్థులకు హాస్టల్ సదుపాయాన్ని కల్పిస్తారు. వీరిలో దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థినులకు, అదే విధంగా ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మొదటి ప్రాధాన్యతను ఇస్తారు. వీరికి వసతితో పాటు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తారు. హాస్టల్ వద్ద ఎలాంటి ఇబ్బంది లేకుండా కేర్ టేకర్, నైట్ వాచ్‌మన్ విధులు నిర్వహిస్తారు.

**దరఖాస్తులు ఇలా..**

ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో కానీ, మీ సేవ కేంద్రాల్లో కానీ హెచ్‌టీటీపీ: //183.82.97.97/ ఎంఎస్‌టీజీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.



ఆదర్శ పాఠశాల పెబ్బేరు

**మెరుగైన విద్య అందిస్తాం**



విద్యార్థులను నిరంతరం పర్యవేక్షిస్తూ.. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన చేయడంతో మంచి ఫలితాలు సాధిస్తున్నాం. దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థినులకు హాస్టల్ సదుపాయాన్ని కల్పిస్తాం. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- నరేష్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్, పెబ్బేరు

## రెవెన్యూ సదస్సును వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

గోపాల్‌పేట, మే 6 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలు ఉన్న ప్రతీ రైతు భూ భారతి రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం మండలంలోని మున్ననూరు, తాడిపర్తి గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులను కలెక్టర్ ఆదర్శ్ సురభి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ... రెవెన్యూ సదస్సు నిర్వహించనున్న గ్రామంలో దరఖాస్తులను ఒక రోజు ముందుగానే పంచడం అదే విధంగా గ్రామ డప్పు టాంటాం వేయించడం వంటివి చేయాలన్నారు. భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రేషన్ షాప్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రాజు, మదన్, తిలక్ రెడ్డి పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం తూకం చేయాలి



మదనాపురంలో గోదాంను పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

వనపర్తి రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : వడ్లు తీసుకునేటప్పుడు తాలు, గడ్డి లేకుండా నిబంధనల ప్రకారం ఉన్నవి వెంటనే తూకం చేసి కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం వనపర్తి మండల పరిధిలోని కడుకుంట్ల, చిమనగుంటపల్లి వరి కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. వరిలో తాలు లేకుండా చూడాలని, అదే విధంగా పాత గన్నీ బ్యాగులు కాకుండా కొత్త గన్నీ బ్యాగులు వాడుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన వరిని మిల్లులకు త్వరగా తరలించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్వాహ కులను ఆదేశించారు.

**ధాన్యం సరఫరాలో ఆలసత్వం ఉండొద్దు..**

మదనాపురం : ధాన్యం సరఫరాలో ఎలాంటి అలసత్వం ఉండొద్దని జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గోదాంను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్రహంలింకన్, ప్రశాంత్, ఆర్.ఐ రాజేశ్వరి పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలను హరిస్తున్న మోదీ ప్రభుత్వం



తిప్పడంపల్లిలో ఫయాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

ఆత్మకూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేటర్లకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చి మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తున్నాడని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ఎన్ రమేష్ తెలిపారు. ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె సందర్భంగా ఆశా కార్యకర్తలతో కలిసి తిప్పడంపల్లి ప్రాథమిక వైద్యశాల మెడికల్ ఆఫీసర్ ఫయాజ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మోదీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి 8 పని దినాలను 12 గంటల పని దినాలకు పెంచేందుకు మోదీ ప్రభుత్వం పూనుకుందని ఆరోపించారు. అనంతరం సమ్మె నోటీసును అందజేశారు. ఆశా కార్యకర్తలు సంధ్య, నవనీత, పుష్పమ్మ, రాజేశ్వరి, నిర్మల, మాధవి పాల్గొన్నారు.

## వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థుల సంఖ్య పెంచాలి



కొత్తకోట వేసవి శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీఈవో అబ్దుల్ ఘని

ఖిల్లాఘణపురం, మే 6 (ఆంధ్రజ్యోతి) : వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపును మంగళవారం జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని పరిశీలించారు. విద్యార్థులు ఆడుతున్న క్యారమ్స్ ఆటను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో డిజిటల్ విద్యా బోధనలను మెరుగుపరిచి విద్యాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. పాఠశాల ప్రాంగణంలో పచ్చదనాన్ని పరిశీలించి మొక్కలు అధిక సంఖ్యలో నాటాలని సూచించారు. సమ్మర్ క్యాంపును విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి మహానంది, లక్ష్మారెడ్డి, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

పెద్దమందడి : విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలని జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని సూచించారు. మండలంలోని మద్దిగట్ల-మోజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని సమ్మర్ క్యాంపు శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అకాడమిక్ మానిటరింగ్ అధికారి మహానంది, రాధ, ఎస్.వరప్రసాద్‌రావు, ఎ.వెంకటస్వామి, సేవ్య, నందిని, పావని, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

కొత్తకోట : సమ్మర్ క్యాంపులు విద్యార్థుల శారీరక, మానసిక, భావోద్వేగ వికాసానికి దోహదపడుతాయని జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని అన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాన్ని మంగళవారం సందర్శించారు. డీఈవో వెంట ఏఎంవో మహానంది, సీనియర్ ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, రామేశ్వరి, జోష్ణవి, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

పాన్‌గల్ : ప్రాథమిక పాఠశాల కేతేపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో హరివిల్లు అనే పేరుతో సమ్మర్ క్యాంపు ప్రారంభించారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పద్మ, ఉపాధ్యాయులు వెంకటేష్, ప్రేమ్ సాగర్, శేఖర్, గోవింద్, శిరీష, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

### లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

కొత్తకోట, మే 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న 11 మందికి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మదనాపురం మార్కెట్ యార్డు చైర్మన్ ప్రశాంత్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్యపరంగా ప్రజలకు సహాయ సహకారాలు అందించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, మిషేక్, బాలరాజు యాదవ్, రవీందర్‌రెడ్డి, ముజీబ్, యాదయ్య సాగర్, తయుబ్, మతీన్, నజీర్ ఉన్నారు.

### రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలి

శ్రీరంగాపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.శ్రీనివాసులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బందికి ఎన్‌సీడీ టీబీ ఏఎన్‌సీ ఇమ్యూనైజేషన్‌ను పరిశీలించారు. వైద్యులు సమయ పాలన పాటించాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని వైద్యులకు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రాముడు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పెబ్బేరులో మూడు చలివేంద్రాలు ప్రారంభం

పెబ్బేరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : పెబ్బేరు మునిసిపాలిటీలో మంగళవారం పెబ్బేరు సంత పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు చలివేంద్రాలను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పనుల నిమిత్తం మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పట్టణ కేంద్రానికి వస్తుంటారన్నారు. వేసవి కాలంలో వారి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో దోహదపడుతాయన్నారు. పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్, సుభాష్ చౌరస్తా, కొల్లాపూర్ చౌరస్తా ప్రధాన కూడలిలో చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పెబ్బేరు సంత పరిరక్షణ సమితి, వేణుగోపాల స్వామి భూమి పరిరక్షణ సమితి సభ్యులున్నారు.

### మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

శ్రీరంగాపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వెంకటాపురంలో మంగళవారం వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మన్యపురెడ్డి మాట్లాడుతూ... వాహనాన్ని నడిపే ప్రతీ ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనానికి ఇన్సూరెన్స్ తప్పనిసరి అని అన్నారు. అదే విధంగా ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ కలిగి ఉండాలని సూచించారు. అదే విధంగా మద్యం తాగి వాహనాలు నడపరాదని, అలా నడిపిన వారిపై చట్టపరంగా చర్యలు ఉంటాయని తెలియజేశారు.

### ధాన్యం తూకాల్లో తేడాలు.. రైతుల ఆందోళన

ఖిల్లాఘణపురం, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మూడు వేర్వేరు ధర్మ కాంట బరువుల్లో వ్యత్యాసం రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని సల్కెలాపూర్‌కి చెందిన రైతు ఉపన్న ట్రాక్టర్‌లో ధాన్యం బస్తాలు వేసుకుని మంగళవారం మండల కేంద్రంలోని మిల్లుల వద్ద వే బ్రిడ్జిల్లో తూకం వేయగా తూకాలలో వ్యత్యాసాలు వచ్చాయి. మండల కేంద్రంలోని మిల్లుల్లో ట్రాక్టర్‌ను తూకం చేయగా దివ్య నవ్య రైస్ మిల్లు కాంటాలో 9,910 కిలోలు ఉండగా, శ్రీనివాస రైస్ మిల్ కాంటాలో 9,730 కిలోలు ఉండగా, శ్రీలక్ష్మీ వెంకటేశ్వర రైస్ మిల్ కాంటాలో 9,640 కిలోల బరువు ఉన్నట్లుగా వేర్వేరుగా చూపడంతో రైతులు మిల్లులకు తెచ్చే ధాన్యం బరువులు తేడాలు వస్తున్నాయని గుర్తించారు. లక్ష్మీ వెంకటేశ్వర రైస్ మిల్లు వద్ద బరువు తక్కువగా వస్తుందని రైతులు ప్రశ్నించగా.. తమ తూకం సరైనదని సమాధానం దాటవేశారు. ఒక్కో ట్రాక్టర్ ధాన్యమును మిల్లులకు విక్రయించడంతో క్వింటాల్ నుంచి మూడు క్వింటాళ్ల ధాన్యం డబ్బులు నష్టపోతున్నామని రైతులు వాపోయారు. అధికారులు స్పందించి తూకాలలో తేడాలను గుర్తించాలని రైతులు కోరుతున్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటాం..



చెక్కు అందజేస్తున్న నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట, మే 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అధికారంలో ఉన్న లేకున్నా నాయకులకు, కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తాడిపత్రిలోని అడ్డాకుల రవీందర్ ప్రమాదానికి గురై మృతి చెందాడు. పార్టీ సభ్యత్వ బీమాను మృతుడి భార్య అంజలికి మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పార్టీ సభ్యత్వ బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, తిరుపతయ్య, మన్నె నాయక్, చంద్రశేఖర్, కృష్ణయ్య, శంకరయ్య, మోహన్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

## రసాయనిక ఎరువులను తగ్గించాలి



మాట్లాడుతున్న అధికారులు

గోపాల్‌పేట, మే 6(ఆంధ్రజ్యోతి) : రైతులు పంటలపై అంగట్లో దొరికే రసాయనిక ఎరువులను పంటలపై తగ్గించాలని వ్యవసాయ శాస్త్రవేత్త డా.మాధురి అన్నారు. మంగళవారం ఏదుల మండలంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం వారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని రైతు వేదికలో చేపట్టారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త మాధురి, డా.మహేశ్వర, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్ మాట్లాడుతూ... రైతులు రసాయనిక ఎరువులను వాడకూడదని, కృత్రిమంగా వారి ఎరువులను వారే తయారు చేసుకోవాలని సూచించారు. శ్రీకాంత్, కర్ణశ్రీ, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

**పంట సాగులో మెలకువలు పాటించాలి**

అమరచింత : మారుతున్న కాలానికి అనుకూలంగా రైతులు పాత పద్ధతులను వదిలి తమ పంట సాగులో మెలకువలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి అరవింద్ పేర్కొన్నారు. మంగళవారం రైతు ముంగిట్లో వ్యవసాయ అధికారులు అనే కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని చంద్రఘడ్‌లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ... భూసార పరీక్షలు, విత్తన శుద్ధి, వానకాలంలో వేసే పంట రకాలు తదితర వాటిని తమ వ్యవసాయ అధికారులతో అడిగి అవగాహన పెంచుకోవాలన్నారు.

## పాత లేబర్ కోడ్‌లను పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

వనపర్తి టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత లేబర్ కోడ్‌లనే పునరుద్ధరణ చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటం రాజు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలన మొదలైనప్పటి నుంచి కార్మికులపై ఉక్కు పాదం మోపుతూ.. కార్మిక చట్టాలను దోపిడీదారులకు, కార్పొరేట్ పెద్దలకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా నాలుగు కోడులుగా మార్చిందన్నారు. సెస్ ద్వారా వసూలైన రూ.2,680 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర పనులకు అక్రమంగా తరలిస్తుందని ఆరోపించారు. ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులకం పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పుట్ట ఆంజనేయులు, నిక్సన్, మదన్, వెంకటయ్య, కురుమయ్య, బాలస్వామి, రాబర్ట్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే మార్నింగ్ వాక్



కాలనీలో తిరుగుతూ సమస్యలను తెలుసుకుంటున్న బీజేపీ నాయకులు

వనపర్తి, మే 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మార్నింగ్ వాక్ చేపడుతున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 1వ వార్డు రాయిగడ్డలో కాలనీలో పార్టీ నాయకులతో కలిసి తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీలోని సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని, అధికారులు ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. రాబోయే మునిసిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని ప్రతి వార్డులో మార్నింగ్ వాక్ చేయడంతో పాటు ప్రజా సమస్యల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. లోక్‌నాథ్ రెడ్డి, రామన్ గౌడ్, వెంకటేశ్వర్ రెడ్డి, సీతారాములు, రాములు, రాజశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలి



పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో ఉమాదేవి

ఆత్మకూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకుని ఈ వేసవిలో ఉపాధి పొందాలని వనపర్తి డీఆర్‌డీవో ఉమాదేవి పేర్కొన్నారు. ఆత్మకూరు మండల పరిధిలోని పిన్నంచర్లలో ఓ రైతు పొలంలో చేస్తున్న ఉపాధి పనులను మంగళవారం డీఆర్‌డీవో ఉమాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ అందజేశారు. ఎంపీడీవో శ్రీపాదు, శ్రీరామ్, విజయ భాస్కర్ పాల్గొన్నారు.

పాన్‌గల్ : ఉపాధి హామీ పనిని ప్రతీ ఒక్క కూలీ సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ సుల్తాన్ అన్నారు. మంగళవారం బుసిరెడ్డిపల్లి, రాయినిపల్లి, మాందాపూర్‌లో కొనసాగుతున్న పనులను, నర్సరీలను ఆయన పరిశీలించారు.

## జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి

అమరచింత, మే 6 (ఆంధ్రజ్యోతి) : కొత్త మండలం ఏర్పడి అనేక సంవత్సరాలు కావొస్తున్నా నేటికి అమరచింతలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయకపోవడం విచారకరమని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ పేర్కొన్నారు. మంగళవారం అమరచింతలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పదేళ్ల టీఆర్ఎస్ ప్రభుత్వం కళాశాల ఏర్పాటు చేయలేదని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎన్నికల ముందు హామీ ఇచ్చిన నేటికీ 15 నెలలు గడుస్తున్నా జూనియర్ కళాశాల ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు. మునిసిపాలిటీ కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాల పేద, మధ్య తరగతి విద్యార్థులకు కళాశాల చదువు అందని ద్రాక్షగా మారుతుందని విమర్శించారు. విశాల్, చేతన్, షైబు, ప్రశాంత్ పాల్గొన్నారు.

## 'రిజర్వేషన్ల పితామహుడు సాహు మహారాజ్'



సాహు మహారాజ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే మొదటిసారి రిజర్వేషన్లు ఇచ్చి అమలు చేసిన రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహు మహారాజ్ అని ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఛత్రపతి సాహు మహారాజ్ 103వ వర్ధంతిని మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఛత్రపతి వీర శివాజీ మహారాజ్ మునిమనుమడు సాహు మహారాజ్ మొట్టమొదటిసారి కొల్హాపూర్ సంస్థానంలో రిజర్వేషన్లను ప్రవేశపెట్టాడని అన్నారు. ఆర్థిక, వైద్య, విద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక చట్టాలను తీసుకొచ్చిన ఆదర్శప్రాయుడు సాహు మహారాజ్ అని కొనియాడారు. గిరిరాజాచారి, నాగరాజు, శాంతన్న, బాలేమియా, లక్ష్మయ్య పాల్గొన్నారు.